క్లుప్తంగా

భావనారాయణస్వామి ఆలయ హుండీల లెక్కింపు

రూ.3.25 లక్షల ఆదాయం



ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

కాకినాడ రూరల్: జిల్లాలో పురాతన ప్రసిద్ధి గాంచిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో హుండీలను దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు బుధవారం లెక్కించారు. కాకినాడ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర పర్యవేక్షణలో ఈఓ భీమ శంకర, ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణ రావు హుండీలను భక్తులు, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు లెక్కించారు. హుండీల ద్వారా రూ.3,25,362 ఆదాయం లభించినట్టు ఈఓ తెలిపారు. సభ్యులు జోకా సత్తిబాబు, ఘంటసాల బద్రీనారాయణ, పుల్ల వీరవెంకట సత్యనారాయణ, పారాయణం భక్తులు, అర్చకులు, పుల్ల స్వాములు, ఘంటసాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ అక్షతల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో అయోధ్య రాముని అక్షితలు, రామాలయం ఫొటో, కరపత్రాలతో పాటు శ్రీరామ శత కోటి పుస్తకాలను ఆధ్యాత్మిక వేత్త గల్లా సుబ్బారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి హిందువు ఇంట్లో పూజించే ఇష్టదైవం శ్రీరాముడన్నారు. 550 సంవత్సరాల నుంచి అయోధ్యలో రామ మందిరం కోసం ఎదురు చూస్తున్నారని అది ఇప్పటికి నెరవేరిందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కల్కి అవతారంలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు కల్కి అవతారంలో భక్తులను దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

కాకినాడ: నగరపాలక సంస్థలోని విక్టోరియా వాటర్‌వర్క్స్‌లో పైప్‌లైన్‌పై నీటి మీటర్లు వేస్తున్నందున 23, 24, 25 డివిజన్లలో శుక్రవారం ఉదయం, 38, 43, 44, 45 డివిజన్లలో సాయంత్రం ఒక పూట నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి.సత్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం కేశనవారి వీధి, గాయత్రీనగర్, పద్మనాభనగర్, భానువారి వీధి, సాయంత్రం ప్రతాప్‌నగర్, స్వామినగర్, ద్వారకానగర్, మెహర్‌నగర్, నరసన్ననగర్‌లలో నీటి సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంతాల్లో ముందుగా మంచినీటిని నిల్వ చేసుకోవాలని ఆమె సూచించారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తామని, ఇందుకోసం 96767 70461, 97484 71415, 63013 87834 నెంబర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేట సౌమ్య ఎన్‌క్లేవ్‌లో ఉన్న మరకత మణికంఠకు ఉత్తర నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పాలు, పంచదార, విభూది, గంధం, కొబ్బరినీళ్లు, తేనే వివిధ రకాలు ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు నందమూరి వినోద్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఊయల సేవ, దీపోత్సవం నిర్వహించారు. పీఠం కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, జి.సతీష్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి మృతిపై కేసు నమోదు

కాకినాడ రూరల్: పెదపూడి మండలం ఏపీ త్రయం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి పప్పు పోసి మణికంఠ (19)మృతిపై ఇంద్రపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం మణికంఠ సూరంపాలెంలోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం సివిల్ బ్రాంచ్‌లో విద్యను అభ్యసిస్తున్నాడు. గత నెల 27న మండలంలోని గంగనాపల్లి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి కాకినాడలోని నాగమల్లిజంక్షన్ వద్ద ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఇంజినీరింగ్ కళాశాల హెచ్‌ఓడీ, లెక్చరర్ల వేధింపులు తాళలేక మణికంఠ ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుని కుటుంబ సభ్యులు ఆరోపించారు. చిక్సిత పొందుతూనే లెక్చరర్లు వేధించినట్టు మణికంఠ ఇచ్చిన వాయిస్ వైరల్‌గా మారింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై సూర్యప్రకాశ్ తెలిపారు.

ఎన్నికల్లో కాకినాడను గిఫ్ట్‌గా ఇస్తాం

- సమర్థుడైన జగన్ ఆధ్వర్యంలో పనిచేయడం అదృష్టం
- అబద్ధాల చంద్రబాబు, పవన్‌లను నమ్మొద్దు
- సీఎం బహిరంగ సభలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల, ఎంపీ గీత తదితరులు

కాకినాడ: వై నాట్ 175/175 అన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలో భాగంగా వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ద్వారా సీఎంకు కాకినాడను గిఫ్ట్‌గా ఇస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీని అమలు చేసిన ఓ సమర్థుడైన సీఎం జగన్ ఆధ్వర్యంలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. స్థానిక ఆర్ఎంసీ గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి సీఎం సమక్షంలో మాట్లాడారు. 2024లో మొట్టమొదటి సమావేశానికి కాకినాడ పట్టణానికి వచ్చిన జగనన్నకు హ్యాపీ న్యూ ఇయర్ అని ద్వారంపూడి అన్నారు. మాట మీద నిలబడే నాయకుడి ఆధ్వర్యంలో పనిచేయడం మా అదృష్టమని, రాజకీయ నాయకుడంటే ఇలా ఉండాలని నిరూపించినది మన జగనన్నేనని అన్నారు. మాతో పాటు రాష్ట్ర ప్రజలు కూడా అదృష్టవంతులని, 2019లో నేను ఎమ్మెల్యే అయ్యే సమయానికి 14,700 పింఛన్లు ఉండేవని, జగనన్న మంచితనంతో ఇప్పుడవి సుమారు 29,100 అయ్యాయన్నారు. గతంలో పెన్షన్ మంజూరు కావాలంటే ఎవరైనా చనిపోవడమో, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనో సాధ్యమయ్యేదని, ఇప్పుడా పరిస్థితి పూర్తిగా తొలగి పారదర్శకంగా, అర్హతే ప్రాతిపదికగా ఇస్తున్నారన్నారు. మాట ఇచ్చిన ప్రకారం రూ.3,000 పింఛన్ పెంచారని, ఇచ్చిన హామీ మేరకు జనవరిలో వైఎస్సార్ చేయూతతో పాటు మరెన్నో పథకాల లబ్ధిని నేరుగా ఖాతాల్లో వేసేందుకు సిద్ధమవుతున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి పేర్కొన్నారు.

'బాబు' పేరుతో ఒక్క పథకమైనా ఉందా?

ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రులుగా పనిచేసిన ప్రతి ఒక్కరూ పాలనలో తమదైన ముద్రవేసుకున్నారని, చంద్రబాబు పేరుతో మాత్రం ఒక్కటంటే ఒక్క పథకమైనా లేదని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ పేరిట రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం, వైఎస్సార్ పేరుతో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఉన్నాయి. జగనన్న అమ్మఒడి, చేయూత, పింఛన్లు, ఆసరా వంటి మరెన్నో పథకాలు పెట్టి పేరుతెచ్చుకుంటే 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు పేరుతో ఒక్క పథకమైనా ఉందా అని నిలదీశారు. వైఎస్సార్ లేకపోయినా ఆయన పెట్టిన పథకాలను ఏ ప్రభుత్వం తొలగించలేదని, అదీ ఆయన సమర్థత అన్నారు. ప్రజలకు అబద్ధాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అందరినీ మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. ఇలాంటి వ్యక్తిని బంగాళాఖాతంలో కలిపినా తప్పులేదంటూ వ్యాఖ్యానించారు. అవినీతికి, లంచాలకు తావులేని పారదర్శక పాలన ఏపీలో కొనసాగుతోందని, ప్రజలంతా పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. ఇంత మంచి చేసిన ముఖ్యమంత్రికి ప్రజలంతా జేజేలు పలకాలని పిలుపునిచ్చారు. జగనన్న ఏ మీటింగ్‌కు వెళ్ళినా నా వల్ల లబ్ధి జరిగి ఉంటేనే మళ్ళీ నన్ను ఆశీర్వదించండి అంటూ కోరుతున్నారని, అదీ ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాబోయే 90 రోజులు జగనన్న కోసం పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు, పవన్‌బాబు, లోకేష్‌బాబు వంటి ఎంతమంది బాబులు వచ్చినా నమ్మొద్దని కోరారు. మీ ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి ఆదరించాలన్నారు. ఈ 90 రోజులు చాలా మాయ మాటలు చెబుతారని, కుట్రలు చేస్తారని వీటిపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.















వైఎస్సార్ పింఛను కానుక రూ.3000 పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి బుధవారం కాకినాడ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లోని హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఆయన సతీమణి మహాలక్ష్మి, తండ్రి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత, ఆమె భర్త కాశీ విశ్వనాథ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఆమె భర్త, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కరప ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి, కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, జేఎన్‌టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, పింఛన్ల పంపిణీ వేదిక వద్ద స్వాగతం పలికిన నగర కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు

స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్త్రీలను గౌరవించడం మన సాంప్రదాయమని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు పేర్కొన్నారు. యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన సావిత్రీ బాయి పూలే 193వ జయంతి వేడుకల్లో పాల్గొని ఆమె ప్రాధాన్యాన్ని వివరించారు. మహిళలు విద్యను అభ్యసించి జీవితంలో ఆర్థికంగా స్థిరపడితే తన కుటుంబానికి వెన్నుముకగా నిలుస్తారన్నారు. ఉన్నత విద్య అభ్యసించకపోయినా విద్య ప్రాముఖ్యత గుర్తించి అట్టడుగు వర్గాల వారికి విద్యనందించే ఆశయం కోసం సావిత్రీబాయి పూలే చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. విద్యార్థినులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ స్వరూపరాణి, రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, వర్సిటీ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. వాకర్స్ జిల్లా కౌన్సిలర్ అడబాల రత్నప్రసాద్, చక్రధర రావు, రాఘవరావు, సత్యనారాయణ చౌదరి తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సాయిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

ఆధునిక విద్య ద్వారానే స్త్రీకి విముక్తి

బోట్‌క్లబ్: ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందన్నారు ప్రముఖ రేడియాలజిస్ట్ సత్య స్కాన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కాదా వెంకట రమణ అన్నారు. సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడలోని భానుగుడి సెంటర్ లో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుక నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. డాక్టర్ బి.తేజశ్రీ, ఎం.అనంత లక్ష్మి, బి.డి.సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత సంక్షేమానికి సాగర్ పరిక్రమ్ యాత్ర

- కేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా
- వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులతో సమావేశం



మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డు పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రులు పర్షోత్తమ్ రూపాలా, ఎంపీ వంగా గీత, మురుగన్, రాష్ట్ర మంత్రి అప్పలరాజు తదితరులు

కాకినాడ రూరల్: దేశంలో తీర ప్రాంత అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగర్ పరిక్రమ యాత్ర చేపడుతున్నట్టు కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా పేర్కొన్నారు. పదో విడత కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఐదు రోజులు పాటు పర్యటిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. బుధవారం వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యశాఖ అధికారులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్య అతిథులుగా కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, యానాం ఎమ్మెల్యే అశోక్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, తదితరులు హాజరయ్యారు. మంత్రి రూపాలా మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో తీర ప్రాంతాల అభివృద్ధి, మత్స్యకారులు సంక్షేమానికి అనేక సంస్కరణలు చేపట్టేందుకు ఈ యాత్ర చేపడుతున్నామన్నారు. పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా డీప్ సీ వెసల్ చిన్న చిన్న యూనిట్లను మత్స్యకారులు కోరుతున్నారని, దీనిపై ఆ పథకాన్ని పునః సమీక్షిస్తామన్నారు. ఎంపీ గీత జిల్లాలో కోతకు గురువుతున్న తీర ప్రాంత రక్షణ చర్యలు, కాకినాడ ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి రూ.65 కోట్లు కోరడంతో మంత్రి హామీ ఇచ్చారు. మత్స్యకారుల జీవన విధానం, ఆర్థిక పరిస్థితి మారాలనేది ప్రధాని కోరిక అని, వారి అభివృద్ధికి కిసాన్ క్రెడిట్‌కార్డులు అందిస్తున్నామన్నారు. కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి మురుగన్ మాట్లాడుతూ సాగర్ పరిక్రమ యాత్ర ద్వారా మత్స్యకారుల గురించి ఆలోచిస్తున్నట్టు తెలిపారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ సాగర్ పరిక్రమ యాత్ర రాష్ట్రానికి మంచి చేస్తుందన్నారు. కాకినాడ పోర్టు రూ.90 కోట్లుతో ఆధునికీరణ చేస్తున్నామని తెలిపారు. అనంతరం మత్స్యకారులకు కిసాన్ కార్డులు, సబ్సిడీలు పంపిణీ చేశారు. కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాల, సతీమణి సవితాబెన్ రూపాలాను మత్స్యకారులు గజమాలతో సత్కరించారు. కేంద్ర మత్స్యశాఖ జేడీ నీతూ కుమారి, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, జేసీ ఇలక్కియ, మత్స్యశాఖ జేడీ సత్యనారాయణ, తదతరులు పాల్గొన్నారు.

ఓటు ఎవరికి పడిందబ్బా..!?

- సందేహాలు నివృత్తిచేసే వీవీ ప్యాట్
- అవగాహన కల్పిస్తున్న ఎన్నికల సిబ్బంది



వీవీ ప్యాట్ ద్వారా వేసిన ఓటును నిర్ధారించుకుంటున్న ప్రజలు



ఓటరు వేసిన గుర్తును నిర్ధారిస్తున్న వీవీ ప్యాట్

కాకినాడ: ఓటు వేసిన వారిలో ఒకటే సందేహం .. నేను ఏ గుర్తుకు ఓటు వేశానో వాళ్లకే పడిందా? బటన్ ఒకచోట నొక్కితే మరొకరికి పడిందా? మన ప్రమేయం లేకుండా ఓట్లన్నీ గుంపగుత్తగా ఏదో ఒక పార్టీకే పడిపోయాయా?... ఇలా వేసిన ఓటుపై ఓటర్లలో అనేక సందేహాలు ఏర్పడడం సర్వ సాధారణమైంది. కొన్ని రాజకీయ పార్టీలు అవగాహన లేక చేసే విమర్శల వల్ల ఎల్క్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల పనితీరు అనేక అపోహలకు ఆస్కారం కల్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నచ్చిన వారికి ఓటరు వేసిన ఓటు దుర్వినియోగం కాదని తెలియజెప్పే ప్రయత్నం చేస్తోంది ఎన్నికల కమిషన్.

వీవీ ప్యాట్‌తో నివృత్తి

బ్యాలెట్ యూనిట్‌పై నచ్చిన అభ్యర్థికి ఓటు వేసిన వెంటనే పక్కనే ఉన్న వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫయ్యబుల్ పేపర్ ఆడిట్ ట్రైమ్) సందేహాన్ని నివృత్తి చేసుంది. ఓటు వేసిన ఏడు సెకండ్ల వరకు వీవీ ప్యాట్‌లో ఎవరికి వేశామో ఆ నెంబర్‌ను స్క్రీన్‌పై స్పష్టంగా నిర్ధారించి చూపిస్తోంది. ఒకరికి ఓటు వేస్తే వేరొకరికి వెళితే అక్కడే తేటతెల్లమైపోతుంది. ఇది నిర్ధారణ చేసుకుని ఓటరు బయటకు వెళ్లేందుకు ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుంది.

విస్తృత ప్రచారం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరుపై విస్తృత ప్రచారం చేపట్టారు. కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన మెషీన్లను ఏర్పాటు చేశారు. మరో వీవీ ప్యాట్, ఈవీఎంలను రోజుకొక పోలింగ్‌స్టేషన్ వద్ద ఉంచి ప్రజలతో స్వయంగా పరీక్షించి నిర్ధారించేలా అవగాహన కల్పిస్తున్నారు. వేర్వేరు నెంబర్లకు ఓట్లు వేసి రెండు మూడుసార్లు సందేహాన్ని నివృత్తి చేసేలా ప్రజలకు, ఓటర్లకు అవగాహన పెంచుతున్నారు. ఈ విధానానికి ప్రజల్లో మంచి స్పందనే కనిపిస్తోందని అక్కడ ఉన్న ఎన్నికల సిబ్బంది బి.అర్జున్ చెప్పారు.

సందేహాల నివృత్తికే..



వేసిన ఓటుపై ఓటరుకు ఉండే సందేహాలను నివృత్తి చేసేందుకు వీవీ ప్యాడ్ ఎంతో ఉపయోగపడుతోంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్టిన వీవీ ప్యాట్‌లో వివిధ పనులపై వచ్చే ప్రజలు స్వయంగా పరీక్షించుకుని నిర్ధారణ చేసుకుంటున్నారు. వాస్తవాన్ని తెలుసుకున్నాక ప్రజల్లో కూడా వీటి పనితీరుపై అపోహలు తొలుగుతున్నాయి. ఈ పరికరం ద్వారా నగరంలో మరిన్ని ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేస్తాం.

– సీతాపతిరావు, ఏఈఆర్వో, తహసీల్దార్, కాకినాడ అర్బన్